మేడ్చల్‌కు నేడు కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి రాక

మేడ్చల్ టౌన్, డిసెంబరు 31 : వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి మేడ్చల్ మండలపరిధిలోని గౌడవెల్లి, పూడూరు పంచాయతీల్లోపాల్గొననున్నారు. ఉదయం 11.30 గౌడవెల్లికి రానున్నారు. అనంతరం 2.30 గంటలకు మల్కాజిగిరి పార్లమెంట్ కోర్ మీటింగ్ నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు వరకు పూడూరులో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి తెలిపారు.



నయా జోష్

అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు


ఆమనగల్లులో మటన్ విక్రయాలు

పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సర స్వాగత వేడుకలు ఉమ్మడి జిల్లాలో అంబరాన్నంటాయి. ఆదివారం రాత్రి మొదలుకొని సోమవారం తెల్లవారుజాము వరకు ప్రజలు వేడుకల్లో పాల్గొన్నారు. కేక్‌లు కట్‌చేసి 2024 సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే వివిధ దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. మద్యం, చికెన్, మటన్, చేపల అమ్మకాలు భారీగా సాగాయి. రాత్రి మహిళలు ఇళ్ల వద్ద రంగవల్లులు తీర్చిదిద్దారు. కాగా రిసార్టులు, ఫామ్ హౌస్‌లు, దాబాలు, హోటళ్లు ఆటా పాటలు, డ్యాన్సులతో హోరెత్తాయి.





పోలీసుల ప్రత్యేక నిఘా

ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంప్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్‌లెస్ డ్రైవింగ్‌లను అరికట్టేందుకు సైబరాబాద్, రాచకొండ పోలీసులు ప్రత్యేక కెమెరాలను అమర్చారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి 8గంటల నుంచి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సర్టిఫికెట్లు లేని వారి వాహనాలను కస్టడీలోకి తీసుకున్నారు. నిబంధనలు పాటించని వారిపై మోటర్ వెహికిల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐలు లక్ష్మారెడ్డి, సైదులు, సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహించారు.

- 2023కు వీడ్కోలు, 2024ఏడాదికి స్వాగతం పలికిన ప్రజలు
- కేక్‌లు కట్‌చేసి పరస్పరం శుభాకాంక్షలు
- రిసార్ట్‌లు, హోటళ్లు, దాబాలు, ఫామ్‌హౌస్‌లలో అలరించిన సంగీత, నృత్య కార్యక్రమాలు
- ముంగిళ్లలో ముగ్గులతో మహిళల కోలాహలం


వికారాబాద్‌లో మద్యం అమ్మకాలు


మేడ్చల్‌లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు


తాండూరులో వివిధ రకాల కేకులు

రంగారెడ్డి అర్బన్, ఆమనగల్లు/వికారాబాద్, /చేవెళ్ల/ఘట్‌కేసర్ రూరల్/మేడ్చల్, వికారాబాద్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) డిసెంబరు 31: న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబురాలుఅంబరాన్నంటాయి. 2023 ఏడాదికి వీడ్కోలు, 2024 వత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలు ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవార్లూ వేడుకల్లో మునిగి తేలారు. తేదీ మారగానే కేట్‌లు కట్ చేయడం, శుభాకాంక్షలు తెలుపుకోవడం, స్వీట్లు పంచుకోవడం చేశారు. హోటళ్లు, రిసార్టులు, దాబాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొన్నారు. చిన్నాపెద్దా, పురుషులు, మహిళలు కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ఆదివారం అర్ధరాత్రి 12గంటలు దాటగానే టపాసుల మోతలతో గ్రామాలు, మండలాలు మార్మోగాయి. అర్ధరాత్రి వరకు బార్లు, రెస్టారెంట్లు తెరిచారు. గతేడాది కంటే ఈసారి ఈవెంట్లకు టికెట్ ధర 30 శాతం వరకు పెంచారు. అయినా.. యువత ఎగబడి టికెట్లు కొన్నారు. శంషాబాద్ విమానాశ్రయంలోని నోవాటెల్‌లో కపుల్ ఎంట్రీకి రూ.19,999 తీసుకున్నారు. స్టాగ్‌ఫిమేల్ ఎంట్రీకి రూ.2,499, క్యాబానాను రూ.1,19,999 అద్దెకు తీసుకున్నారు. రిసార్ట్స్‌లో మూడు రోజుల ప్యాకేజీలు పెట్టారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో 'రామోజీ న్యూ ఈయర్ ఈవ్' పేరుతో రెడ్ వెల్వెట్, థ్రిల్ బ్లాస్ పార్టీలు నిర్వహించారు. గేటెడ్ కమ్యూనిటీలు, వ్యవసాయ క్షేత్రాల్లోనూ వేడుకలు జరుపుకున్నారు. గ్రామాల్లో యువకులు పొలాల వద్ద డీజే పెట్టుకొని మద్యం తాగుతూ డ్యాన్స్‌లు చేశారు. ఎక్కువ మంది ఇళ్ల వద్ద న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నారు.


మేడ్చల్ హౌసింగ్ బోర్డు రోడ్డులో బేకరీ వద్ద కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు


ఆమనగల్లులో రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు


స్పీకర్ ప్రసాద్‌కుమార్



కలెక్టర్లు గౌతమ్ పోట్రు, నారాయణరెడ్డి


ఎమ్మెల్యే మల్లారెడ్డి

కొత్త ఏడాది ప్రజల్లో సంతోషాలు నింపాలి

వికారాబాద్ జిల్లా, రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ 2024 సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ కుటుంబంలో సంతోషం నింపాలని, ప్రతి ఒక్కరూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు పడుతున్న కష్టాలు తొలగేలా కృషి చేస్తామన్నారు. జిల్లాను 3వేల కోట్లతో అభివృద్ధి పరిచేలా కృషిచేస్తున్నామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి, ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలయ్యేలా పథకాలను అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో 2లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీ ఉంటే, 50లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి పరుస్తామన్నారు. పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు గౌతమ్ పోట్రు, సి.నారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రతీ కుటుంబంలో సంతోషాలు నిండాలని, లక్ష్య సాధనకు ప్రజలు కృషిచేయాలని ఆకాంక్షించారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సైతం ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

కొనుగోళ్లతో జనం బిజీ.. విందులు వినోదాలతో ఖుషీ

రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో ఎక్కడ చూసినా న్యూ ఇయర్ జోష్ కన్పించింది. బేకరీల్లో జోరుగా కేక్‌లు అమ్మారు. ఉదయం నుంచి రాత్రి వరకు దుకాణాల్లో వివిధ వస్తువుల, మద్యం, మాంసం, చేపల విక్రయాలు పెద్దఎత్తున జరిగాయి. అర్ధరాత్రి నుంచే వాకిళ్లలో విష్ యూ హ్యాపీ న్యూ ఇయర్ 2024 ముగ్గులు వేశారు. వికారాబాద్‌లోని హోటళ్లు, బేకరీలు వినియోగదారులకు కొత్త సంవత్సర ఆఫర్లు ప్రకటించాయి. రిసార్ట్‌లు, దాబాల్లో సందడి నెలకొంది. రాత్రి రోడ్లపై పండగ వాతావరణం నెలకొంది. వైన్స్‌లలో మద్యం బాటిల్ కొంటే గ్లాస్ ఫ్రీ ఇచ్చారు. కొత్త సంవత్సరంలో చాలా మంది ఆలయాలకు, చర్చిలకు వెళ్లారు. ఇందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. వికారాబాద్ జిల్లాలో ఉన్న అనంతపద్మనాభస్వామి ఆలయం, రామలింగేశ్వరాలయం, వేంకటేశ్వరాలయం, శ్రీరామ్‌మందిర్, మల్లికార్జునాలయం, ఎన్కతల శనైశ్వరాలయం, వెల్చాల్ లక్ష్మీనరసింహస్వామి, దామగుండం రామలింగేశ్వర ఆలయాల్లో భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. మేడ్చల్‌లో మార్కెట్లన్నీ కిక్కిరిశాయి. బేకరీలు, జనరల్, మద్యం దుకాణాలు, చికెన్ సెంటర్లలో రద్దీ నెలకొంది. రాత్రి పొద్దుపోయే వరకు అమ్మకాలు సాగాయి. వైన్‌షాపుల వద్ద క్యూ కట్టారు. ముగ్గుల కోసం మహిళలు రంగులు కొన్నారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో కొత్త సంవత్సర వేడుకల సందడి నెలకొంది. ఫామ్ హౌస్‌లలో కుటుంబీకులతో సరదాగా గడిపారు. ఘట్‌కేసర్ మండలంలో ఫామ్‌హౌస్‌ల వద్ద స్టేజీలు ఏర్పాటు చేసి డీజే డ్యాన్సులతో సంబరాల్లో మునిగితేలారు.

చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాల్లో జెండా ఎగరేద్దాం

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు


మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన ఉమ్మడి జిల్లా నేతలు

హైదరాబాద్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించుకుందామని, ఆ దిశగా కార్యక్రమాలను చేపట్టాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ నేతలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో ఆదివారం మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు చరణ్‌కౌశిక్ యాదవ్, భూపతిరెడ్డి, పార్టీ నేతలు పరమేశ్వర్‌రెడ్డి, బండి రమేశ్ తదిరులు కలిశారు. ఈ సందర్భంగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో పార్టీ గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నేతలకు మంత్రి చెప్పారు. ఆయా నియోజకవర్గాల్లో సమస్యలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు.


కోట్‌పల్లి ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తున్న సందర్శకులు

సరదా సరదాగా...

ధారూరు, డిసెంబరు 31: కయాకింగ్ బోటింగ్ ప్రారంభం కావటంతో కోట్‌పల్లి ప్రాజెక్టుకు పూర్వపు కళ సంతరించుకుంది. కొంత కాలంగా ప్రాజెక్టుకు వెళ్లే దారులను అధికారులు మూసివేయటంతో సందర్శకులు రాక బోటింగ్ నిలిచిపోయింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాజెక్టు వద్ద శనివారం బోటింగ్‌ను ప్రారంభించారు. దీంతో ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు ఇక్కడి వచ్చారు. ప్రాజెక్టు నీటిలో సరదాగా బోటింగ్ చేసి ఉల్లాసంగా గడిపారు.

మామిడి సాగుకు వికారాబాద్ భూములు అనుకూలం

● ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి

వికారాబాద్/పూడూరు, డిసెంబర్ 31 : వికారాబాద్ జిల్లాలో 15 వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారని ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి తెలిపారు. ఆదివారం వికారాబాద్ జిల్లాలోని పూడూరు మండలంలో క్షేత్ర స్థాయిలో మామిడి తోటలను ఉద్యానశాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి వాతావరణం, ఎర్ర నేలలు కలిగినటువంటి జిల్లాలో మామిడి పంట చాలా నాణ్యతగా రావడం జరుగుతుందన్నారు. నాణ్యమైన పంట పండించడానికి పాటించాల్సిన సూచనలను రైతులకు వివరించారు. డిసెంబర్ నెలలో వాతావరణంలో తేమ శాతం ఎక్కువ ఉండడం వల్ల మామిడి రైతులు సస్యరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. దీని వల్ల పూత నల్లగా మారడం, పూత రాలిపోవడం, పూతకు బూడిద తెగులు రావడం జరుగుతుందన్నారు. పచ్చి పూత దశలోనే సస్యరక్షణ పిచికారీలు చేపట్టరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు వైజయంతి, అర్చన, అబ్దుల్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి

గ్రామాభివృద్ధికి కృషి : జడ్పీటీసీ

షాబాద్, డిసెంబరు 31 : గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని హైతాబాద్ అనుబంధ గ్రామమైన అంకుగూడలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్, నాయకులు రాందేవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ముగిసిన ధ్యాన మహాయాగం వేడుకలు

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ధ్యాన, ఆధ్యాత్మిక వేత్తలకు సత్కారం



పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిని సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న సభ్యులు

కడ్తాల్, డిసెంబరు 31: మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. ధ్యాన మహాయాగం వేడుకలు-2లో భాగంగా 11 రోజుల పాటు ధ్యాన సంబురాలు వైభవంగా నిర్వహించారు. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ధ్యాన, శాఖాహార జగత్తే లక్ష్యంగా నిర్వహించిన వేడుకల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి ధ్యానులు, సాధకులు, సందర్శకులు, పిరమిడ్ మాస్టర్లు హాజరయ్యారు. ముగింపు వేడుకల్లో పీఎ్‌సఎస్‌ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిమళ పత్రి, పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయ భాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు ప్రాత:కాలం ధ్యానం నిర్వహించారు. అనంతరం ధ్యానులు పత్రీజీ శక్తి స్థల్ ను సందర్శించి ధ్యాన నివాళులర్పించారు. ఈసందర్భంగా పరిమళ పత్రీజీ, విజయభాస్కర్ రెడ్డిలు మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతీ ఒక్కరు ధ్యానాన్ని అలవరుచుకొని ఆనందమయ జీవితాన్ని పొందాలన్నారు. ధ్యానం ద్వారా వినయశీలత, సంకల్ప శక్తి సిద్ధించి ఒత్తిళ్ల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. పత్రీజీ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయనపై అభిమానంతో లక్షలాది మంది ధ్యానులు హాజరై వేడుకలను విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. పలు ధ్యాన, ఆధ్యాత్మిక పుస్తకాలను పరిమళ పత్రీ, విజయభాస్కర్‌రెడ్డిలు ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అమితంగా ఆకట్టుకున్నాయి. పలువురు పిరమిడ్ మాస్టర్లు, ధ్యాన గురువులు, యోగులు, ఆధ్యాత్మికవేత్తల సందేశాలు ఆకట్టుకున్నాయి. ధ్యాన వేడుకల విజయవంతానికి సహకరించిన గురువులు, పిరమిడ్ ట్రస్టీ సభ్యులను విజయభాస్కర్‌రెడ్డి, పరిమళ, పరిణితి పత్రీలు సత్కరించి అభినందించారు. వేడుకలో పిరమిడ్ ట్రస్టీ సభ్యులు సాంబశివరావు, శివప్రసాద్‌రావు, దామోదర్‌రెడ్డి, మాధవి, నవకాంత్, హన్మంతరావు, శ్రీరామ్ గోపాల్, అన్మాస్‌పల్లి సర్పంచ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిలువు దోపిడీ!

గ్యాస్ కనెక్షన్ ఈకేవైసీకి ఒక్కో వినియోగదారుడి నుంచి రూ.50 వసూలు



శామీర్‌పేటలోని దత్తాత్రేయ భారత్‌గ్యాస్ ఏజెన్సీ కేంద్రం వద్ద ఈకేవైసీ నమోదుకు పడిగాపులు కాస్తున్న వినియోగదారులు (ఫైల్)

- గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తే రూ. 20-50 వసూలు
- అడ్మినిస్ట్రేషన్ చార్జీల పేరిట గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల అక్రమార్జన
- శామీర్‌పేట దత్తాత్రేయ (భారత్ గ్యాస్) ఏజెన్సీ నిర్వహకుల అక్రమాలు
- చోద్యం చూస్తున్న పౌరసరఫరాల అధికారులు

శామీర్‌పేట, డిసెంబరు 31: వంటగ్యాస్ లబ్దిదారులు ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేదు... గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ బాయ్ వచ్చినప్పుడు ఈకేవైసీ ఉచితంగా చేస్తారు... దీనికి ఫలానా వరకూ గడువు అని లేదు... ఎప్పుడైనా చేసుకోవచ్చు.. అని ఒక వైపు ప్రభుత్వం, మరో వైపు అధికారులు చెబుతుండగా... శామీర్‌పేటలోని దత్తాత్రేయ (భారత్ గ్యాస్) ఏజెన్సీ నిర్వాహకులకు పట్టడం లేదు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఇదే అదనుగా ఈకేవైసీ చేసే క్రమంలో వినియోగదారుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. అంతే కాకుండా గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే క్రమంలో డెలివరీ బాయ్స్ నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వినియోగదారుల వద్ద నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకులు అడిందే ఆటా.. పాడిందే పాట అన్నట్లుగా మారింది. ఈ అక్రమ తంతూ మండల కేంద్రం శామీర్‌పేటలో దర్జాగా సాగుతోంది. శామీర్‌పేటలోని దత్తాత్రేయ (భారత్ గ్యాస్) ఏజెన్సీ ఉంది. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేసుకోవాలని సూచించడంతో కార్యాలయానికి వచ్చిన వినియోగదారుల నుంచి ఈకేవైసీ చేసేందుకు రూ. 50 వసూలు చేస్తున్నారు.



గ్యాస్ ఏజెన్సీలో వినియోగదారుల నుంచి ఈకేవైసీ చేస్తున్న నిర్వాహకులు

గ్యాస్ డోర్ డెలివరీ చేస్తే రూ.20 నుంచి 50 వసూలు

అంతేకాకుండా ప్రభుత్వ నియమ నిబంధనల విరుద్ధంగా శామీర్‌పేట మండలంలో భారత్ గ్యాస్ కంపెనీకి చెందిన దత్తాత్రేయ ఏజెన్సీ వారు గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేసేటప్పుడు వినియోగదారులను నుంచి జబర్దస్తీగా రూ. 20 నుంచి 50దాకా వసూలు చేస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత పౌర సరఫరాల అధికారులు తమకేమీ పట్టనట్టు చోద్యం చూస్తున్నారని భారత్‌గ్యాస్ నియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ. 50 ఇస్తేనే ఈకేవైసీ

ఓ పక్క ఏళ్ల తరబడి వినియోగదారులకు సిలిండర్ డోర్ డెలివరీ చేస్తూ ఏజెన్సీ నిర్వాహకులు రూ. 20నుంచి 50వరకూ వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా ఈ కేవైసీ కోసం వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ వద్దకు వెళ్లగా వసూళ్ల దందాకు పాల్పడుతున్నారు. ఈకేవైసీ చేసినందుకు ఒక్కో వినియోగదారుడి నుంచి అడ్మినిస్ట్రేషన్ చార్జీల పేరిట రూ.50 వసూలు చేస్తున్నారు. ఈ అక్రమ వసూళ్ల దందా శామీర్‌పేటలో కొద్ది రోజులుగా కొనసాగుతోంది. ఈకేవైసీ చేసేందుకు వినియోగదారుల వద్ద నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోకుండా ఉచితంగా చేయాలని గ్యాస్ ఏజెన్సీలకు ప్రభుత్వం ఆదేశించింది. అయినప్పటికీ ప్రభుత్వం ఆదేశాలను తుంగలో తొక్కుతూ శామీర్‌పేటలోని దత్తాత్రేయ (భారత్ గ్యాస్) ఏజెన్సీ వారు వినియోగదారుల వద్ద నుంచి రూ. 50 దోచుకుంటున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే అడ్మినిస్ట్రేషన్ చార్జీల కింద రూ. 50లను వినియోగదారుల నుంచి కేవైసీ కోసం తీసుకుంటున్నామని నిసిగ్గుగా చెబుతున్నారు.

ఈకేవైసీ కోసం పడిగాపులు

కాగా గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ నమోదు కోసం మూడు రోజులుగా శామీర్‌పేట దత్తాత్రేయ (భారత్ గ్యాస్) ఏజెన్సీ వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వేలాది మంది నానా అవస్థలు పడుతూ ఈకేవైసీ కోసం నిరీక్షిస్తున్నారు. గ్యాస్‌ఏజెన్సీ వారు మాత్రం రోజుకు 200 మంది వినియోగదారులకు మాత్రమే ఈకేవైసీ చేస్తున్నామని చెపుతున్నారు

అక్రమ వసూళ్లను అరికట్టాలి



శామీర్‌పేట గ్రామంలో నాలుగేళ్లగా భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేస్తే రూ. 20 నుంచి రూ. 50 వరకూ వసూలు చేస్తున్నారు. ఒక వేళ డబ్బులు ఇవ్వకపోతే గ్యాస్ సిలిండర్ ఇవ్వడం లేదు. నా వద్ద డెలివరీ బాయ్ రూ.30 తీసుకుని గ్యాస్‌ను డెలివరీ చేశాడు. ఈకేవైసీ చేసినందుకు గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నా వద్ద నుంచి రూ. 50 తీసుకున్నారు.

- దేశబత్ని సత్యనారాయణ, వినియోగదారుడు, శామీర్‌పేట

నిబంధనల మేరకే వసూలు చేస్తున్నాం



నిబంధనల మేరకే ప్రభుత్వ సబ్సిడీ పొందేందుకు ఈకేవైసీ నమోదు కోసం అడ్మినిస్ట్రేషన్ చార్జీల కోసం వినియోగదారుల వద్ద నుంచి రూ.50 వసూలు చేస్తున్నాం. గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ చేసేటప్పుడు డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు.

- చందు, భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వహకుడు, శామీర్‌పేట

ఏజెన్సీ సూచన మేరకే వసూలు చేస్తున్నాం



ఏజెన్సీ నిర్వాహకుల సూచన మేరకే డబ్బులు తీసుకుంటున్నాం. గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ సమయంలో వసూలు చేస్తున్నాం.

-దిలీప్, గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో వికారాబాద్ ఉపాధ్యాయుడికి సిల్వర్ మెడల్



రాష్ట్ర స్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన ఉపాధ్యాయుడు అశోక్

వికారాబాద్, డిసెంబరు 31: వికారాబాద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అశోక్ జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. బార్వాద్ గ్రామానికి చెందిన అశోక్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. త్వరలో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆయన రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అశోక్‌ను రామయ్యగూడ ఎంఐజీ (విద్యానగర్)కాలనీవాసులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కడియాల చంద్రశేఖర్, దోమ అమర్‌నాథ్, వికారాబాద్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్సింహులు, బాబ్యానాయక్ అభినందించారు.



మాట్లాడుతున్న సద్గురు సాయికుమార్

ప్రకృతిపైనే మానవ మనుగడ

మేడ్చల్ టౌన్, డిసెంబరు 31: ప్రకృతిపైనే మానవ మనుగడ ఆధారపడి ఉన్నదని, ప్రకృతికి ప్రానం పోసే వృక్షాలను కాపాడుకోవాలని సాయిగీత ఆశ్రమ వ్యవస్థాపకులు సద్గురు సాయికుమార్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయ శివార్లలో ఉన్న సాయిగీత ఆశ్రమంలో ఆదివారం సర్వదోశ మహాయజ్ఞంను నిర్వహించారు. ప్రతీ సంవత్సరం చివరి ఆదివారం నిర్వహించే ఈ మహత్తర కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున పాల్గొని వృక్షాలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురు సాయికుమార్ మాట్లాడుతూ.. వృక్షాల్లో ఉన్న శక్తిని గుర్తించి వాటిని పెంచాలన్నారు.



జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో యువకుడికి గోల్డ్‌మెడల్

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 31: మండలంలోని హిమాయత్‌నగర్ గ్రామానికి చెందిన షాబాద్ సాయికుమార్ బాడీ బిల్డింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. రెండు రోజులుగా నగరంలోని షేక్‌పేటలో జరిగిన డాక్టర్ కౌకబ్ క్లాసిక్ తెలంగాణ అమెచ్యూర్ బాడీ బిల్డర్స్ అసొసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో హిమాయత్‌నగర్ గ్రామానికి షాబాద్ సాయికుమార్‌కు మొదటి స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా గ్రామస్థులు సాయికుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో షాబాద్ శాంతికుమార్, కంజర్ల అరవింద్, షాబాద్ సాయికుమార్, రాహుల్, రాజేష్, ప్రమోద్ పాల్గొన్నారు.



శంషాబాద్ బస్టాండు చౌరస్తాలో రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలు(ఫైల్)

రోడ్డుపైనే పార్కింగ్

- శంషాబాద్‌లో పెరుగుతున్న వాహనాల రద్దీ
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు

శంషాబాద్, డిసెంబరు 31 : శంషాబాద్ పట్టణంలో నిత్యం వాహనాల రద్దీ పెరిగిపోతుండడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో పాటు ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని పలు చౌరస్తాల్లో వాహనాల రద్దీ పెరిపోయింది. బస్టాండు, కోత్వాల్‌గూడ, ఎయిర్‌పోర్టు చౌరస్తాల వద్ద ప్రయాణికులు రోడ్డు దాటడానికి కూడా వీలు లేనంతగా ట్రాఫిక్ సమస్య ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. శంషాబాద్ పట్టణంతో పాటు తొండిపల్లి, ఊట్‌పల్లి, కోత్వాల్‌గూడ, సాతంరాయి, గండిగూడ, ఘాన్సిమియాగూడ, గొల్లపల్లి, పోషెట్టిగూడ, హమీదుల్లానగర్, శంకరాపురం, చిన్నగోల్కొండ, పెద్ద గోల్కొండ,నాగారం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు బాగా పెరిగిపోయాయి. శంషాబాద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో రోజురోజుకూ జనాభా పెరిగిపోతోంది. దాంతోపాటు వాహనాల సంఖ్య కూడా పెరిపోతోంది. శంషాబాద్ నుంచి దేశంలోని ఏ పట్టణానికి వెళ్లాలన్నా బస్సు, రైలు సౌకర్యాలుండడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు కూడా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉండటం వల్ల ఈ ప్రాంతం ఎక్కువ మంది ప్రజలకు నివాసయోగ్యంగా మారింది. దాంతో పదేళ్ల క్రితం కంటే ఇప్పుడు జనాభా బాగా పెరిపోయింది. శంషాబాద్‌లో వ్యాపారం చేసే వారి సంఖ్య కూడా పెరిగిపోయింది. పట్టణంలోని సిద్ధాంతి బస్తీ నుంచి బస్టాండు, అంబేడ్కర్ ఎయిర్‌పోర్టు చౌరస్తాల మీదుగా గ్రామ శివార్లలోని కాముని చెరువు వరకు ఉన్న హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిపై కొత్తగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో విమానాశ్రయం, ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు నేరుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి పైనుంచి వెళుతున్నాయి. అయితే, ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రహదారికి పక్కన వాహనాలు పార్కు చేస్తుండడంతో తరుచూ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి నర్కోడ-షాబాద్ వైపు వెళ్లే రోడ్డులో వాహనాలు పెద్దసంఖ్యలో పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయి. కోత్వాల్‌గూడ చౌరస్తా, ఎయిర్‌పోర్టు చౌరస్తా, గొల్లపల్లి చౌరస్తాలో రోడ్డు పక్కన వాహనాలు నిలపడంతో ఇబ్బందులు పడాల్సివస్తోంది. ట్రాఫిక్‌ను నియంత్రించడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ వాహనాల రద్దీతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల ఇబ్బందులు తొలగించడానికి మున్సిపల్ సిబ్బందితో పాటు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తా

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ఘనంగా గౌతాపూర్ మల్లికార్జునస్వామి జాతర



జాతరలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, డిసెంబరు 31: మండలంలోని గౌతాపూర్ మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి కృషిచేస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గౌతాపూర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న మల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి గంగాస్నానం, పల్లకీ సేవ ఊరేగింపు, బోనాల ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. సంప్రదాయబద్ధంగా గ్రామస్తులంతా ఏకమై స్వామివారి జాతరను ఇంతపెద్ద ఎత్తున నిర్వహించడం సంతోషకరమన్నారు. ఆలయ నిర్మాణం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజప్పగౌడ్, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, నాయకులు డాక్టర్ సంపత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జర్నె నాగప్ప, కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపకులు పూజారి పత్తి చంద్రప్ప, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పటేల్ రాంరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు వెంకటయ్య పాల్గొన్నారు.



ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

పాలమూరు వర్సిటీ విద్యార్థుల 'ట్రెక్కింగ్'



పర్వతారోహణ చేస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 31: కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని నర్కండలో జరుగుతున్న జాతీయ సాహస క్రీడల్లో పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొంటున్నారని ఆ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న షాద్‌నగర్ డిగ్రీ కళాశాల లెక్చరర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హిమాలయాల్లోని దూలదార్ రేంజ్‌లో ఉన్న షర్కేజర్ ట్రెకింగ్ జరిగిందని తెలిపారు. ట్రెక్కింగ్‌లో తనతో పాటు నవీన్ ప్రకాష్, బద్రు, సావిత్రి, నవీన్‌కుమార్, రాఘవేందర్, అంజనేయులు, దివ్యవాణిలు పాల్గొన్నారని రవీందర్‌రెడ్డి తెలిపారు. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో విద్యార్థుల సాహస క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారని తెలిపారు.

న్యూఇయర్ సంబురం

● భారీగా కేక్‌లు, మద్యం అమ్మకాలు ● డ్రైఫ్రూట్ కేక్ కిలో రూ.1200



పరిగిలో అమ్మకానికి సిద్ధంగా కేక్‌లు



మేడ్చల్ టౌన్: మద్యం దుకాణం వద్ద జనం



మేడ్చల్ టౌన్: న్యూ ఇయర్ కోసం అమ్మకాలకు సిద్ధంగా ఉంచిన కేక్‌లు

పరిగి, డిసెంబరు 31: కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచే సందడి నెలకొంది. కేకుల అమ్మకాలకు భలే గిరాకీ కనిపించింది. పరిగి పట్టణంలోని 30కిపైగా బేకరీలు, స్వీట్ హౌజ్‌లు ఉన్నాయి. ఆదివారం సాయంత్రం జనంతో కిటకిటలాడుతూ కనిపించాయి. కేక్ కిలో రూ.200ల నుంచి రూ.1200వరకు విక్రయించారు. న్యూఇయర్ సంబురాలకు యువత మొదలుకొని మహిళలు, వృద్ధులకు వరకు సిద్ధం చేసుకున్నారు. రకరకాలుగా వెరైటీ కేక్‌లు ప్రత్యేకంగా తయారు చేయించుకున్నారు. డ్రైఫ్రూట్స్‌తో చేసిన కేక్ కిలో రూ.1200లకు విక్రయించారు. మరికొన్ని రూ.800లకు విక్రయించారు. మందు, విందులతో సంబురాలు చేసుకునేందుకు అవసరమైన వనరులను ముందుగానే సమకూర్చుకున్నారు. కొందరు అర్ధరాత్రి కట్ చేయడానికి, మరికొందరు 2024 జనవరి ఒకటిన కేక్‌లను కట్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పరిగిలోని బేకరీల వద్ద యువకులు గుంపులు, గుంపులుగా కనిపించారు.

కొడంగల్ రూరల్: నూతన సంవత్సరం 2024కు స్వాగతం పలికేందుకు యువకులు ఫుల్ జోష్‌తో కనిపించారు. ఆదివారం 31 డిసెంబరు అర్ధరాత్రి నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు యువకులు, ప్రజలు కొడంగల్ పట్టణంలోని బేకరీల దగ్గర బారులు తీరారు.

ధారూరు: ధారూరులోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి న్యూ ఇయర్ కేక్‌లు విక్రయాలు జోరుగా కొనసాగాయి. చికెన్, మటన్ దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి కనిపించింది. ధారూరుతో పాటు, పరిసర గ్రామాల యువకులు అర్ధరాత్రి కేరింతలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

తాండూరు: తాండూరులో ఆదివారం పలు బేకరీ షాపుల్లో సందడిగా మారాయి. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, తాండూరులో కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేశారు. ఏ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లొంక నర్సింహులు, హన్మాపూర్ ఎంపీటీసీ నీలు దంపతులు కొత్త సంవత్సరం సందర్భంగా కొనుగోలు చేసిన స్కార్పియో కార్‌ను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జడ్పీటీసీ ధారాసింగ్ కలిసి ప్రారంభించారు. మనోహర్‌రెడ్డి స్వయంగా కొద్ది దూరం నడిపారు.

ఎక్కడ చూసినా కేకుల విక్రయాలే

ఘట్‌కేసర్: నూతన సంవత్సరం సందర్భంగా కేకులకు డిమాండ్ పెరిగింది. దీంతో ఘట్‌కేసర్‌లో ఎక్కడ చూసినా కేకుల విక్రయ దుకాణాలే దర్శనమిచ్చాయి. ఘట్‌కేసర్‌లోని పాత జాతీయ రహదారిపై, స్థానిక ఎదులాబాద్ రోడ్డులో భారీగా కేకుల విక్రయ దుకాణాలను ఏర్పాటుచేశారు. ఘట్‌కేసర్‌లోని ఓ బేకరీ నిర్వాహకులు ఏకంగా ఓ ఏసీ వాహనాన్ని ఏర్పాటుచేసి అందులో కుల్ కేకులను, శీతలపానీయాలను భద్రపరిచి విక్రయించారు. అయితే, ఈ సంవత్సరం బేకరీ నిర్వాహకులు ఎలాంటి ఆఫర్లు పెట్టకపోవడంతో స్థానికులు, యువకులు నిరుత్సాహానికి గురయ్యారు.

మేడ్చల్‌లో..

మేడ్చల్ టౌన్: మేడ్చల్‌లో న్యూ ఇయర్ వేడుకలకు ప్రజలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ముందు అందంగా ముగ్గులు వేశారు. యువకులు కేక్‌లు కొనటానికి బేకరీల వద్ద చేరారు. వైన్సుల వద్ద జనం గుమిగూడారు. తప్పతాగి రోడ్డు పై వచ్చే వారిని నియంత్రించ టానికి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి పలువురిపై కేసు నమోదు చేశారు.



తాండూరు: చిన్నారులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



కొడంగల్ రూరల్: కొడంగల్‌లో ఓ బేకరీ వద్ద సందడి



ధారూరు: చికెన్ షాపు వద్ద చికెన్ అమ్మకాలు

వెయ్యి కేక్‌లు తయారు చేశా



తాను వెయి కేక్‌లను తయారు చేశారు. కిలో నార్మల్ కేక్ రూ.200ల నుంచి నాణ్యతను బట్టి రూ.600 వరకు విక్రయించారు. ఈ సారి ఆదివారం ఉండడంతో గీరాకి ఉన్నప్పటికి గుంపులు,గుంపులుగా రాలేదు.

-అఫ్రోజ్, బేకరి యజమాని

2024లో రైల్వేలైను, సాగునీరు సాధిస్తాం



పరిగి: పరిగి మీదుగా, పాలమూరు ఎత్తిపోతల ద్వారా సాగునీరు, అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు అప్పా జెంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రైల్వే లైన్‌ను ఈ ఏడాది సాధిస్తాం. రూ.10వేల కోట్లతో పరిగిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను రూపొందించా. ఆ దిశగా ముందుకు సాగుతా. న్యూ ఇయర్ వేడుకలను ఈ సారి ఇంట్లో కుటుంబ సభ్యులతోనే జరుపుకుంటున్నాం. పరిగి నియోజకవర్గ ప్రజలు, జిల్లా వాసులంతా కొత్త ఏడాదిలో మంచి జరిగి, లక్ష్యాలు సాధించాలని కోరుకుంటున్నా. పరిగిని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యం.

- డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే

మేడ్చల్‌లో రామ భక్తుల శోభాయాత్ర

మేడ్చల్ టౌన్, డిసెంబరు 31: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్యతో పూజిత అక్షింతల మహాశోభ యాత్రను ఆదివారం మేడ్చల్‌లో రామభక్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా భక్తులు సీతారాముల వారి విగ్రహాతో పాటు, అక్షింతలతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో యాత్రను నిర్వహించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తాండూరు, డిసెంబరు 31: తాండూరు హైదరాబాద్ రోడ్డు మార్గంలో రాజీవ్ కాలనీ వద్ద సిమెంట్ ట్యాంకర్ బైక్ ఢీకోనడంతో బైక్‌పై వస్తున్న ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తాండూరు పట్టణం ఇంద్రానగర్‌కు చెందిన మోబిన్ రాజీవ్‌కాలనీ నుంచి తాండూరు వస్తుండగా ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. యాలాల పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

దౌర్జన్యంగా పశువుల కొట్టం ధ్వంసం

● ఆవు మృత్యువాత ● పోలీసులకు ఫిర్యాదు

పూడూరు, డిసెంబరు 31: గుర్తుతెలియని వ్యక్తులు ఆవులను కట్టేసే రేకుల షెడ్డును ధ్వంసం చేయగా ఓ ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన పూడూరు మండలంలోని ఎన్కెపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కిష్టం గోపాల్ తనకున్న 40ఆవులు, గేదెల కోసం మూడేళ్ల కిందట హైమద్ అనే వ్యక్తి స్థలంలో ఆయన అనుమతితో రేకుల షెడ్డు(కొట్టం) వేసుకుని ఆవులు, గేదెలను కట్టేసుకునేవారు. అయితే ఈనెల 30న కంతల భీమయ్య, కిష్టం శ్రీశైలం, కిష్టం నరేష్, తుంపల్లి రాఘవేందర్, నక్లపురం లక్ష్మయ్య మరికొందరితో కలిసి పశువుల కొట్టాన్ని ధ్వంసం చేసి జేసీబీతో రేకులను కూల్చేశారు. ఈ క్రమంలో ఓ ఆవు మృత్యువాతపడింది. రోజు మాదిరిగానే గోపాల్ ఆవులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి రాత్రి 9గంటల సమయంలో పశువుల కొట్టానికి వచ్చి చూడగా కొట్టంలో రేకులు ధ్వంసమై ఆవు మృత్యువాతపడి ఉన్నాయి. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చట్టాలపై అవగాహన కల్పించాలి



కరన్‌కోట్ పోలీసు స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్



నాగారంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న సీఐ వెంకటయ్య, తదితరులు



దోమ: బాసుపల్లి ప్రధాన రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తాండూరు రూరల్, డిసెంబరు 31: చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. మండలంలోని కరన్ కోట్ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా డీఎస్పీ పోలీసు సిబ్బందితో మాట్లాడారు. గస్తీలు, తనిఖీలు పెంచాలని, ముందస్తు సమాచారాలు సేకరించేలా చూడాలన్నారు. సస్పెక్టర్లను తనిఖీ చేసి వారిపై నిఘా ఉంచాలని ఆదేశించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్‌లను త్వరగా పూర్తి చేసేలా చూడాలని, నేరస్తులపై రికార్డులు కొనసాగించాలని చెప్పారు. పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వారి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రాంబాబు, ఎస్‌ఐ మధుసూదనరెడ్డి, ఎస్‌ఐ-2 విమల పాల్గొన్నారు.



పూడూరు: బీజాపూర్-హైదరాబాద్ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కీసర రూరల్: నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య హెచ్చరించారు. ఆదివారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని ఆర్‌ఎల్‌నగర్‌లో ఆశయం సేవా సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసామని, తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ చింతల సరిత, ఎస్‌ఐ రాజశేఖర్, స్వచ్ఛంద సంస్థ చైర్మన్ మల్లేష్‌యాదవ్, ఓయూ కాలనీ ప్రధాన కార్యదర్శి కిరణ్, నాయకులు రమేష్, హరి, మహేష్, సంతోష్ హుస్సేన్ రావు, నాగరాజు, నాగేశ్వరరావు, శ్రీనివాస్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

దోమ: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని దోమ ఎస్‌ఐ రవిగౌడ్ అన్నారు. మండల పరిధిలోని బాసుపల్లి ప్రధానరోడ్డుపై పోలీసులతో కలిసి ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహించారు.

పూడూరు: పూడూరు మండలంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మండలంలోనిమన్నెగూడ ఎస్‌ఐ గిరి సిబ్బందితో కలిసి ఆదివారం బీజాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

తాండూరు, డిసెంబరు 31: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పేదలకు ముస్లిం వెల్ఫేర్ చేసిన సేవలను కొనియాడారు. తాండూరులో విద్యారంగ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షుడు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 32: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతీఒక్కరు కృషిచేయాలని మర్రిపల్లిగూడస్వామి వివేకానంద యువజన సంఘం నాయకులు తెలిపారు. మండలంలోని ఎదులాబాద్ సౌత్ ఇండియా చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో 42వ జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద సభ్యులు మహేందర్, వినయ్‌కుమార్, నర్సింహ, వార్డుసభ్యుడు భర్తకు గణేష్, మర్రిపల్లిగూడ బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు గుమ్మడి దుర్గయ్య, సభ్యులు మల్లేష్, శంకర్, దనంజయ్, అనిల్, బాబు, మురళి, మనోజ్, ఏడుకొండల్, ప్రభాకర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్మాత్మిక చింతన అలవర్చుకోవాలి



మోమిన్‌పేట్: ఉత్సవాల్లో ఒగ్గు కళాకారులు

మోమిన్‌పేట్, డిసెంబరు 31: సమాజంలో ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండలంలోని చక్రంపల్లి గ్రామంలో ఆదివారం శ్రీ మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాల మధ్య శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.

శుభకార్యాల్లో పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, డిసెంబరు 23: మండలంలోని ధారూరు, కేరెల్లి, కొండాపూర్‌కుర్దు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన వివిధ శుభకార్యాల్లో అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. కెరెల్లిలో కాంగ్రెస్ నాయకుడు కె.వెంకట్‌రాంరెడ్డి కూతుళ్ల నూతన వస్త్రాలంకరణ, కొండాపూర్ కుర్దు గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి మనువడి డోలాహారణం కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ధారూరులో జరిగిన సురేష్ గౌడ్ కూతురు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రతీవార్డులో నీటి సరఫరాకు చర్యలు



రాకంచర్ల లక్ష్మీనపర్సింహస్వామిని దర్శించుకుని మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, డిసెంబరు 31: ప్రతీవార్డులో నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగి మున్సిపాలిటీతో పాటు అనేక గ్రామాలకు నీటి సరఫరా లేదని అనేక ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ మేరకు ఆదివారం మిషన్‌భగీరథ గ్రిడ్ ఈఈ చల్మారెడ్డితో పరిగి మండలం జాఫర్ పల్లి, తదితర ప్రాంతాలను సందర్శించారు. పరిగి నియోజకవర్గంలో మిషన్‌భగీరథ ప్రాజెక్టు పనులు, పైపులైను పనులను మ్యాప్ ద్వారా ఎమ్మెల్యేకు ఈఈ వివరించారు. పరిగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రతీవార్డుకు నీరు సరఫరా అయ్యేలా పనులు చేపట్టాలని ఈఈకి సూచించారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు

పూడూరు: మండలంలోని రాకంచర్ల లక్ష్మీనర్సింహ ఆలయాన్ని ఆదివారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మే నెలలో జరిగే దేవాలయం జాతర వరకు గర్భగుడి పూర్తయ్యే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేవిధంగా చూస్తానన్నారు. ఆలయానికి కావాల్సిన నిధులను ఎండోమెంట్ అధికారులతో మాట్లాడి త్వరగా వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, పెంటయ్య, రాజు, ఆలయ పూజారి, పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

శామీర్‌పేట, డిసెంబరు 31: శామీర్‌పేట మండలం దేవరయాంజాల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1980 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఆదివారం ఒకేచోట చేరారు. తూంకుంటలోని అలంకృత రిసార్ట్ ఇందుకు వేదికైంది. ఈ సందర్భంగా అప్పటి తమ గురువు పీఎల్ నారాయణను సన్మానించి గురుభక్తిని చాటారు. 43 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా అనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు.

సాహసానికి సిద్ధమైన గోరిగడ్డ తండా యువకుడు



శ్రీకాంత్

కులకచర్ల, డిసెంబరు 31: సౌత్ ఆఫ్రికాలో రాక్ క్లైంబ్లీనిగ్ అవరోధించేందుకు మండలంలోని గోరిగడ్డ తండా యువకుడు లావుడ్యా శ్రీకాంత్ ఎంపికయ్యాడు. జనవరి 18 నుంచి 26 వరకు రాక్ క్లైంబ్లీనిగ్ ఎక్కనున్నాడు. ఇంటర్ వరకు మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన గురుకుల కళాశాలలో విద్యను అభ్యసించాడు. అనంతరం భువనగిరి యాదాద్రిలో రాక్ క్లైంబ్లీనిగ్‌లో, అనంతరం జమ్మూ కశ్మీర్‌లోని జవహర్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందాడు. ప్రస్తుతం రాక్ క్లైంబ్లీనిగ్‌ను అవరోధించేందుకు ఎంపికయ్యాడు. శ్రీకాంత్‌ను స్థానికులు పలువురు అభినందిస్తున్నారు.

నవాబుపేట అభివృద్ధికి కృషి

నవాబుపేట, డిసెంబరు 31: నవాబుపేట మండల అభివృద్ధికి కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మండలంలోని మైతాప్‌ఖాన్‌గూడ, నవాబుపేట మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ఆదివారం ఆయన ప్రారంభించారు.

సంక్షిప్తంగా..

● **ఘట్‌కేసర్ రూరల్:** రాజధాని ఢిల్లీలో రిపబ్లిక్‌డే వేడుకలను మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ టి.అఖిల ఎంపికైంది. విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించిన వెస్ట్‌జోన్ ప్రీ రిపబ్లిక్ క్యాంపులో ఎంపిక చేశారు. అఖిల అనురాగ్ యూనివర్సిటీలో బీ-ఫార్మసీ రెండవ సంవత్సరం చదువుతోంది.

● **ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమం సందర్భంగా ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధి మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం 207వ బీమాకోరెగావ్ శౌర్యదివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

తాండూరు: తాండూరు కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్లో మూడు రోజుల పాటు జరిగిన స్పోర్ట్స్ మీట్ ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పాల్గొని విజేతలకు బహుమతులు అందచేశారు.

● **మోమిన్‌పేట్:** సర్వేయర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సుధాకర్ కుమారుడు సాత్విక్ తన తండ్రి జన్మదిన వేడుకను అల్ హెల్ప్ సొసైటీలో 50మంది విద్యార్థుల మధ్య తన జన్మదిన వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిత్విక్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** కొత్తగా పొలం రిజిస్టర్ చేసుకున్న రైతులు రైతు భరోసాకు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఏవో సూర్యప్రకాష్ తెలిపారు. ప్రస్తుతం రైతుబంధు వస్తున్న రైతులు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

● **దోమ:** మండలంలోని దిర్సంపల్లి గ్రామంలో కే.మల్లేశం, కె.శ్రీశైలంకు చెందిన ఫొటోస్టూడియో, సీఎస్‌సీ సెంటర్‌ను ఎంపీటీసీ నవాజ్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య ఆదివారం ప్రారంభించారు.

● **కొడంగల్:** భీమా కోరేగావ్ 206వ శౌర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కొడంగల్ పట్టణంలో దళితుల ఆత్మగౌరవ విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడు కోస్గి దస్తప్ప తెలిపారు.

● **దౌల్తాబాద్:** సుల్తాన్‌పూర్‌లో ఈ నెల 3 నుంచి మహిబూబ్‌సుభానీ దర్గా ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **దౌల్తాబాద్:** రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్రానికి సీఎం కావాలని మొక్కుకున్న కాంగ్రెస్ నాయకులు ఆదివారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. దౌల్తాబాద్‌కు చెందిన మహిపాల్, బాలంపేటకు చెందిన నర్సింహులు 17రోజులు పాదయాత్ర చేసి ఆదివారం తిరుపతిలో స్వామివారిని దర్శించుకొని మొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు.

● **మూడుచింతలపల్లి:** కొల్తూర్‌లో అయోధ్య రామమందిరం అక్షింతలను భక్తిశ్రద్ధలతోట ఊరేగింపు నిర్వహించారు. రామ మందిరం నుంచి గ్రామాలకు చేరుకున్న అక్షింతలకు వేదపండితులు మంత్రోచ్ఛరణలతో పూజలు నిర్వహించారు.